మాటల్లో అబద్ధం ఉన్న
ఫర్వాలేదు
కానీ చూపించే ప్రేమలో
మాత్రం
అబద్ధం ఉండకూడదు

netisudiksha.online

నేటి సుదీక్ష
సమాజానికి సరైన దృక్పథం
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న నేటి సుదీక్ష దినపత్రికలో,బ్యూరో, మండలాల రిపోర్టర్గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిల్లో ఉత్సహావంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 7288033333



హనుమకొండ సంపుటి 01 సంచిక 74 గురువారం ,ఆగస్టు 06, 2026 , పేజీలు - 4 వెల : 2.00 PRGI NO : TGTEL/26/A3170


## రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు

# ఏసీబీ కోర్టు పర్మిషన్..



హైదరాబాద్, ఆగస్టు 5: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సర్వం సిద్ధమైంది. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ ప్రత్యేక ఏసీబీకోర్టు ఆయనకు దేశ పర్యటనకు కావలసిన అనుమతినిచ్చింది. అధికారిక పర్యటన నిమిత్తం విదేశాలకు వెళ్లేందుకు పాస్ పోర్ట్ ను తిరిగి ఇవ్వాలని, ప్రయాణానికి అనుమతించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పైన విచారణ జరిపిన కోర్టు, పలు షరతులతో కూడిన అనుమతిని మంజూరు చేస్తుంది.ఆగస్ట్ 17 నుండి సెప్టెంబర్ 10వరకు విదేశాలకు సీఎం రేవంత్ఏసిబి ప్రత్యేక కోర్టు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆగస్ట్ 17 నుండి సెప్టెంబర్ 10వరకు విదేశాలలో పర్యటించనున్నారు. యునైటెడ్ కింగ్ డమ్, అమెరికా, జర్మనీ, చైనా దేశాలలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. వివిధ రంగాలలో పెట్టుబడుల సమీకరణకు, తెలంగాణా అభివృద్ధి, అధికారిక చర్చల కోసం ఈ పర్యటన రూపుదిద్దుకుంది.రేవంత్ పర్యటనకు ఏసీబీ కోర్టు ఈ మేరకు ఏసీబీ కోర్టు కొన్ని కీలక షరతులు విధించింది. సీఎం రేవంత్ విదేశీ పర్యటనకు లక్ష రూపాయల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఒకరి హామీని కోర్టుకు సమర్పించాలి. అంతేకాదు సీఎం రేవంత్ విదేశీ పర్యటన ప్రణాళికను కోర్టుకు ముందే అందించాలి. అక్కడ పర్యటించే ప్రదేశాలు, ఆయా దేశాలలో బస చేసే పూర్తి వివరాలను కోర్టులో ముందుగానే ఇవ్వాలని పేర్కొంది.సెప్టెంబర్ 18, 2026లోగా తిరిగి కోర్టుకు రేవంత్ రెడ్డి పాస్ పోర్ట్అంతేకాదు పొందాల్సి ఉంటుంది.

## ప్రధాని పోస్ట్ తొలగింపుపై మెటా అధికారి క్షమాపణ..
### సాంకేతిక పొరపాటేనన్న జోయెల్ కప్లాన్..




ఢిల్లీ, ఆగస్టు 5 :ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ వీడియో తాత్కాలికంగా కనిపించకుండా పోవడంపై మెటా చీఫ్ గ్లోబల్ అఫైర్స్ అధికారి జోయెల్ కప్లాన్ వివరణ ఇచ్చారు. ఈ ఘటన ఉద్దేశపూర్వకంగా జరగలేదని, సాంకేతిక లోపం కారణంగానే ఆ వీడియో తాత్కాలికంగా కనిపించలేదని వివరించారు. ఈ మేరకు భారత ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పారు.బుధవారం న్యూఢిల్లీలో ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో జోయెల్ కప్లాన్ నేతృత్వంలోని మెటా ప్రతినిధి బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ పోస్టు తొలగింపు, పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్ నియంత్రణ, కృత్రిమ మేధస్సుతో రూపొందించిన తప్పుడు సమాచారాన్ని అరికట్టే చర్యలు వంటి అంశాలపై చర్చ జరిగింది.ఏఐ ఆధారిత ఆటోమేటెడ్ కంటెంట్ ఫిల్టర్లు పనిచేసే సమయంలో జరిగిన పొరపాటు వల్ల ప్రధాని మోదీ వీడియో కొద్దిసేపు కనబడలేదని మెటా వివరణ ఇచ్చింది. అనంతరం తప్పును గుర్తించి పోస్టును పునరుద్ధరించామని పేర్కొంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని, ప్రముఖుల ఖాతాలకు అదనపు భద్రతా తనిఖీలు అమలు చేస్తున్నామని కంపెనీ తెలిపింది మెటా ఇచ్చిన వివరణ సరిపోదని, ప్రజా ప్రతినిధుల పోస్టులు తొలగించే ముందు మరింత కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. భారత చట్టాలకు అనుగుణంగా కంటెంట్ నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయాలని మెటాకు సూచించింది.

## కేంద్రమంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ..
# కీలక అంశాలపై చర్చ



ఢిల్లీ, ఆగస్టు 5 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈరోజు (బుధవారం) ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఇవాళ పలువురు కేంద్రమంత్రులను సీఎం కలవనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి షెడ్యూల్ బిజీబిజీగా ఉంది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో.. సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు.ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, రహదారులకు శాఖాపరమైన అనుమతులపై కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, ఎస్ఆర్వీ ఆర్ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు పాల్గొన్నారు.కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ..కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ భేటీ అయ్యారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని సీఆర్ పాటిల్‌ని కోరారు. 148 మీటర్ల ఎత్తు నిర్మాణానికి గతంలోనే ఆ రాష్ట్రం అంగీకరించిన విషయాన్ని సీఎం వివరించారు. 150 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు.

## నీటి విషయంలో అన్యాయం జరిగితే
# తెలంగాణ ఊరుకోదు
### : హరీశ్ రావు

హైదరాబాద్, ఆగస్టు 5: ఆగస్టు 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని సమావేశ అజెండాలో చేర్చారని అన్నారు ఈనెల(ఆగస్టు) 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోరు సమావేశం అజెండాపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ



మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు.తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు.తెలంగాణకు తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతోందని హరీశ్ ఆరోపించారు. రాష్ట్రానికి ద్రోహం జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. గురు దక్షిణ చెల్లించడం కోసం రేవంత్ మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు.

## హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసి నకిలీ ఎన్‌వోసీలు..
# 8 ప్రైవేటు కాలేజీలపై ఫిర్యాదు

హైదరాబాద్, ఆగస్టు 5: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఎన్‌వోసీలతో ఇంటర్మీడియట్ అఫిలియేషన్ పొందేందుకు ఎనిమిది ప్రైవేటు జూనియర్ కాలేజీలు ప్రయత్నించాయి. పత్రాల పరిశీలనలో అవి నకిలీవని హైడ్రా, ఇంటర్ బోర్డు అధికారులు గుర్తించారు. దీంతో సంబంధిత కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ హైడ్రా అధికారులు హైదరాబాద్ లేక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులు ఫోర్జరీ, మోసం తదితర కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తు న్నారు .గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. అక్రమకట్టడాలకు సరైన నిబంధనలు పాటించని నిర్మాణాలకు హైడ్రా నోటీసులు పంపు తోంది. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఫేక్ ఎన్‌వోసీ




పత్రాలను తయారు చేసిన ఘటన ప్రస్తుతం కలకలం రేపుతోంది. ఈ నకిలీ పత్రాలను ఆధారంగా చేసుకుని ఎనిమిది ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అఫిలియేషన్ పొందేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది.సాధారణంగా విద్యాసంస్థలకు గుర్తింపు, అఫిలియేషన్ ప్రక్రియలో భాగంగా అగ్నిమాపక భద్రతా నిబంధనలకు సంబంధించిన అనుమతులు, అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఈ కేసులో హైడ్రా నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా.. కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఎన్‌వోసీ సర్టిఫికెట్లను రూపొందించినట్లు అధికారులు గుర్తించారు. ఈ నకిలీ ధ్రువపత్రాలను సంబంధిత కాలేజీల యాజమాన్యాలు ఇంటర్మీడియట్ విద్యామండలికి అఫిలియేషన్ కోసం సమర్పించాయి. ధ్రువపత్రాల పరిశీలన సందర్భంగా పత్రాల్లో అనుమానాస్పద అంశాలు కనిపించడంతో ఇంటర్ బోర్డు అధికారులు హైడ్రాను సంప్రదించారు. అనంతరం హైడ్రా అధికారులు రికార్డులను పరిశీలించగా ఆ ఎన్‌వోసీలు తమ కార్యాలయం జారీ చేసినవి కావని, నిర్ధారించారు.

## డీలిమిటేషన్ బిల్లుకు సహకారం కోరిన కేంద్రం..
### ససేమిరా అన్న విపక్ష నేత రాహుల్ గాంధీ..



ఢిల్లీ, ఆగస్టు 5 :ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసిన కేంద్ర ప్రభుత్వం.. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంట్ ముందుకు తీసుకొచ్చింది. కానీ, ఈ బిల్లు మూడింట రెండొంతుల మెజార్టీ సాధించడంలో విఫలమై వీగిపోయింది. కానీ, టీఎంసీ, శివసేన (యూబీటీ)ల నుంచి చేరికలతో ఈసారి బిల్లును గట్టెక్కించడానికి అవసరమైన మెజార్టీకి చేరువైంది. కానీ, వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన మూడో వారంలోకి ప్రవేశించినా.. ప్రతిపక్షాల ఆందోళనలతో సభ సజావుగా సాగడం లేదు.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మూడు వారంలోకి ప్రవేశించినా ప్రతిష్టంభన కొనసాగుతోంది. విపక్షాలు పట్టువీడకపోవడంతో వరుసగా మూడో వారం కూడా సమావేశాలు సజావుగా సాగడం లేదు. ఈ నేపథ్యంలో గందరగోళానికి తెరదించి, బయటపడే మార్గం కనుగొనేందుకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని సంప్రదించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## తీవ్ర దాడులను ఎదుర్కొంటారా..?
# ఇరాన్‌కు డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్



అమెరికా : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధి ని సాధ్యమైనంత త్వరగా తెరవాలని, లేదంటే తీవ్రమైన దాడులు ఎదుర్కో వాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌తో తమ చర్చలు సానుకూలంగా సాగుతున్నా వాటిని ఆ దేశం బహిరంగంగా ఖండించడం ఆశ్చర్య కరంగా ఉందన్నారు. ఈసారి చర్చల నుంచి వెనక్కి తగ్గితే పరిణామాలు అత్యంత తీవ్రంగా ఉంటాయని టెహ్రాన్ హెచ్చరించారు.రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతిపెద్ద దాడికి అమెరికా సిద్ధమవుతున్న సమయంలో ఇరాన్ తమను సంప్రదించి చర్చలకు రావాలని కోరిందని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై మరో 48 గంటల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. టెహ్రాన్ అణ్వాయుధాలు కలిగి ఉండేందుకు అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోదని అధ్యక్షుడు పునరుద్ఘాటించారు. హర్మూజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రాకపోకలకు సంబంధించి ఇరాన్, ఒమన్‌తో కలిసి తాము చర్చలు జరుపుతున్నామని అగ్రరాజ్యం వెల్లడించింది.దీనిపై ఒకట్రెండు రోజుల్లో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. అయితే ఈ ప్రకటనను ఇరాన్ ఖండించింది. ఒమన్‌తో తాము జరుపుతున్న చర్చల్లో అమెరికా భాగస్వామ్యం ఏమాత్రం లేదని తెలిపింది. తమ సార్వభౌమాధికారాన్ని, భద్రతా ప్రయోజనాలను కాపాడే కొత్త సముద్ర రవాణా విధానాన్ని ఏర్పాటు చేయడంపైనే పేర్కొంది.

# సీఎం చంద్రబాబును కలిసిన బొండా ఉమామహేశ్వరరావు!

అమరావతి: టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సీఎం చంద్రబాబును కలిశారు. బుధవారం చంద్రబాబుతో భేటీ అయిన బొండా ఉమా.. విజయవాడ కార్పొరేషన్ ఎన్నికలపై చర్చించినట్లు తెలిసింది. త్వరగా ఎన్నికలు నిర్వహించాలని కోరినట్లు సమాచారం. మరోవైపు అంబటి రాంబాబుతో కలిసి బొండా ఉమా.. ముద్రగడ సంస్మరణ కార్యక్రమంలో పాల్గొనడం వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా చంద్రబాబుతో బొండా ఉమా భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిశారు. బుధవారం అధినేతను కలిసిన బొండా ఉమా.. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల గురించి చర్చించినట్లు తెలిసింది. విజయవాడ కార్పొరేషన్ ఎన్నికలను త్వరగా నిర్వహించాలని కోరినట్లు సమాచారం. అయితేబొండా ఉమామహేశ్వరరావు అంశం ఇటీవల ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ అయిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సంస్మరణ కార్యక్రమానికి హాజరైన బొండా ఉమా.. వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుతో కలిసి వేదిక పంచుకోవటం సోషల్ మీడియాలో చర్చకు కారణమైంది.వైసీపీ నేతలతో బొండా ఉమామహేశ్వరావు



వేదికను పంచుకోవడంపై టీడీపీ అధిష్టానం కూడా సీరియస్ అయ్యింది. బొండా ఉమామహేశ్వరరావు నుంచి వివరణ తీసుకోవాలని చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఇందుకోసం ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు, కిలారు రాజేష్‌లతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఈత్రిసభ్య కమిటీ ముందు హాజరైన బొండా ఉమామహేశ్వరరావు.. తన వివరణ తెలియజేశారు. సమన్వయ లోపం కారణంగా ఈ సమస్య తలెత్తిందని.. కొన్ని దుష్ట శక్తులు ఈ విషయాన్ని వక్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేశాయని క్లారిటీ ఇచ్చారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకుంటానని వివరణ తెలియజేశారు. ఈ నేపథ్యంలో బొండా ఉమా వివరణతో సంతృప్తి చెందిన టీడీపీ అధిష్టానం.. ఈ వివాదానికి అక్కడితో ఫుల్ స్టాప్ పెడుతున్నట్లు తెలిపింది.


కష్టమర్లకు అలర్ట్.. ఆర్బీఐ వడ్డీ రేట్లు తగ్గించకున్నా ఇలా హోం లోన్‌పై రూ. 15 లక్షల వరకు ఆదా.. సింపుల్ ట్రిక్స్!
పీహెచ్‌సీలు సహా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 60 రకాల మెడికల్ టెస్టులు ఫ్రీ.. ఈ సేవల గురించి మీకు తెలుసా?
హమ్మయ్యా ఎట్టకేలకు స్వల్పంగా తగ్గిన బంగారం ధర.. ఆగస్ట్ 5 గోల్డ్, సిల్వర్ రేట్లు ఇవే36 ఏళ్ల క్రితమే చావు అంచుల్లోకి...ప్రదీప్ రావత్ జీవితంలో మరిచిపోలేని భయానక అనుభవం


మరోవైపు ఈ పరిణామాల నేపథ్యంలో త్వరలోనే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లను కలుస్తానని బొండా ఉమామహేశ్వరరావు ఇటీవల ప్రకటించారు. అన్నట్లుగానే బుధవారం రోజున చంద్రబాబును కలిసినట్లు సమాచారం. ఈ భేటీలో విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల గురించి ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. ఈ ఎన్నికలకు త్వరగా నిర్వహించాలని బొండా ఉమా.. ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిసింది.

నేటి సుదీక్ష
సమాజానికి సరైన దృక్పథం
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

గురువారం, ఆగస్టు 06, 2026



## ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి: కలెక్టర్ బోర్ఘడే హేమంత్



**ములుగు, ఆగస్టు 5 (సుదీక్ష న్యూస్):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఘడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ములుగు నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న 303 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 5 కొత్త కేంద్రాలు ఏర్పాటు చేసి మొత్తం 308 పోలింగ్ కేంద్రాలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. అలాగే రెండు పోలింగ్ కేంద్రాలను మార్చడం, నాలుగు కేంద్రాల పేర్లను సవరించడం జరుగుతుందని చెప్పారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని, రాజకీయ పార్టీల సహకారం అవసరమని కలెక్టర్

## తెలంగాణ అభివృద్ధి అజెండాతో ఢిల్లీలో కీలక భేటీలు

**- సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రులను కలిసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**





**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (సుదీక్ష న్యూస్):** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశమయ్యారు. ఈ భేటీల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కూడా ముఖ్యమంత్రితో కలిసి పాల్గొన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను కలిసి తెలంగాణకు సంబంధించిన పర్యావరణ అనుమతులు, అటవీ సంరక్షణ, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించారు. అనంతరం కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమై రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, వాటికి అవసరమైన నిధుల విడుదలపై వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సమావేశాల్లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, ఇతర ఎంపీలు, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.సమావేశంలో ముఖ్యమంత్రి తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తును 150 మీటర్లకు పెంచేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన పర్యావరణ అనుమతులు, సాగునీటి ప్రాజెక్టులకు నిధుల మంజూరు, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ అభివృద్ధి అజెండాను ముందుకు తీసుకెళ్లే దిశగా సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన ఈ ఢిల్లీ పర్యటనలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పాల్గొని రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం: గాదగోని రవి




**హనుమకొండ, ఆగస్టు 5 (సుదీక్ష న్యూస్):** తెలంగాణలో ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విమర్శించారు. ప్రగతి సింగారం గ్రామంలో జరిగిన ఎంసిపిఐ(యు) హనుమకొండ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.హనుమకొండ నగరంలో వర్షాకాలంలో నీటి నిల్వలు, ఇళ్ల స్థలాలు, మౌలిక వసతుల సమస్యలు పరిష్కారం కాకపోవడం ప్రభుత్వాల వైఫల్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంసిపిఐ(యు) భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను కూడా ఆయన తీవ్రంగా విమర్శించారు.సమావేశంలో పార్టీ నాయకులు వల్లేపు ఉపేందర్ రెడ్డి, ఎన్. రెడ్డి హంసారెడ్డి, గడ్డం నాగార్జున, ఎం.డి. ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ రైల్వే క్రాసింగ్ సమస్యలపై పార్లమెంట్‌లో ఎంపీ డా. కడియం కావ్య ప్రశ్న




**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (సుదీక్ష న్యూస్):** వరంగల్ జిల్లాలో రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల నివారణ కోసం చేపడుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ROB\T), అండర్ బ్రిడ్జిలు (=ఖదీలు) పనుల పురోగతిపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు.దీనికి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖితపూర్వక సమాధానమిస్తూ, జిల్లాలో ప్రస్తుతం నాలుగు ROB/RUB పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. వరంగల్--చింతలపల్లి లెవల్ క్రాసింగ్ నెం.64 వద్ద రూ.77 కోట్లతో =ాదీ నిర్మాణానికి టెండర్ ఖరారైందని, మరో మూడు =ాదీలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో చేపట్టిందని వెల్లడించారు.ఈ సందర్భంగా ఎంపీ డా. కడి యం కావ్య మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న =ాదీ, =ఖదీ పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు సురక్షితమైన, అంతరాయం లేని రవాణా సౌకర్యం కల్పించాలని కేంద్ర రైల్వే శాఖను కోరారు.

## ముప్పై ఏళ్ల దర్గా రోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ, ఆగస్టు 5 (సుదీక్ష న్యూస్):** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 48వ డివిజన్‌లో మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కాజీపేట దర్గా రోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ రూ.50 లక్షలతో సీసీ రోడ్డు, రూ.30 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దర్గా రోడ్‌తో పాటు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన పోతురవేణ శివకుమార్ కుటుంబానికి విద్యుత్ శాఖ మంజూరు చేసిన రూ.5 లక్షల పరిహార చెక్కును అందజేశారు.కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ కుసూర్ పాషా, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో 'డయల్ 100' స్థానంలో కొత్త ఎమర్జెన్సీ నంబర్..!




**హైదరాబాద్ :** తెలంగాణలో 'డయల్ 100' స్థానంలో కొత్త ఎమర్జెన్సీ నంబర్..!
ఇకపై అన్ని ఎమర్జెన్సీ సేవలకు ఒకే నంబర్ '112'.
పోలీస్, అంబులెన్స్, అగ్నిమాపక సేవలకు 'డయల్ 112'.
తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ చేతుల మీదుగా 'డయల్ 112' ఎమర్జెన్సీ నంబర్ ప్రారంభం.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి: రాజనాల శ్రీహరి



**వరంగల్, ఆగస్టు 5 (సుదీక్ష న్యూస్):** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఎస్సీ ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌లోని పేరా--3ను పార్లమెంట్‌లో సవరించి రద్దు చేయాలని కాంగ్రెస్ వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి డిమాండ్ చేశారు.వరంగల్‌లో డీసీఐవీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దళిత క్రైస్తవ శాంతియుత మహాదీక్షల మూడో రోజు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళిత క్రైస్తవులకు రాజ్యాంగబద్ధ హక్కులు కల్పించాలని, ఈ అంశంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఆగస్టు 10న హనుమకొండ అంబేద్కర్ విగ్రహం నుంచి వరంగల్ కలెక్టరేట్ వరకు నిర్వహించే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రి, పలువురు ప్రజాసంఘాల నాయకులు, పాస్టర్లు, చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: సంయుక్త కిసాన్ మోర్చా




**వరంగల్, ఆగస్టు 5 (సుదీక్ష న్యూస్):** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ాఖవీ) నాయకులు పిలుపునిచ్చారు. శివనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వరంగల్‌లో తహసీల్దార్ కార్యాలయం, నర్సంపేటలో ఆర్డీవో కార్యాలయం ముట్టడి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధ హామీ, రుణ విమోచన చట్టం, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరణ, రైతులకు ప్రయోజనం చేకూరేలా పంటల బీమా పథకం అమలు తదితర డిమాండ్ల సాధన కోసం రైతులు, కార్మికులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌ను విజయవంతం చేయాలి: రావు పద్మారెడ్డి




**హనుమకొండ, ఆగస్టు 5 (సుదీక్ష న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపడుతున్న "హర్ ఘర్ తిరంగా" అభియాన్‌ను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంటెస్టెడ్ అభ్యర్థి రావు పద్మారెడ్డి పిలుపునిచ్చారు.బీజేపీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని, కార్యకర్తలు ప్రతి ఇంటికి చేరుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో మాజీ మేయర్ డా. టి. రాజేశ్వర్ రావు, పులి సర్వోత్తమ్ రెడ్డి, దేవనూరి మేఘనాథ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్ఫూర్తి కార్యక్రమంలో విద్యార్థినులకు కలెక్టర్ సత్య శారద మోటివేషన్



**వర్ధన్నపేట, ఆగస్టు 5 (సుదీక్ష న్యూస్):** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో నిర్వహిస్తున్న 'స్ఫూర్తి' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం వర్ధన్నపేట గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించారు.
ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్, విద్యతో పాటు విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, చైతన్యం పెంపొందించుకునేలా కృషి చేయాలని సూచిస్తూ వారికి మోటివేషన్ కల్పించారు.

## స్టేషన్ ఘన్‌పూర్ మెగా లెదర్ పార్క్‌కు వెంటనే ఆమోదం ఇవ్వాలి: ఎంపీ డా. కడియం కావ్య



**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (సుదీక్ష న్యూస్):** జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రతిపాదించిన మెగా లెదర్ పార్క్‌కు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదం తెలపాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో కోరారు. బుధవారం రూల్–377 కింద ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదన చాలా కాలంగా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు.120 ఎకరాల్లో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు అమలైతే ముఖ్యంగా ఎస్సీ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ కేంద్ర అనుమతి లేక ప్రాజెక్టు ఆలస్యమవుతోందని, ఉపాధి కల్పనకు దోహదపడే ఈ మెగా లెదర్ పార్క్‌కు వెంటనే గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలని కేంద్రాన్ని ఎంపీ డా. కడియం కావ్య విజ్ఞప్తి చేశారు.

నేటి సుదీక్ష
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

# డయల్ 100ను ఆశ్రయించే వారికి నిరీక్షణే

హైదరాబాద్: ప్యాట్రోలింగ్, బ్లూకోల్ట్స్ పేరిట ప్రత్యేక సిబ్బంది, ఆధునాతన వాహనాలు అందుబాటులో ఉన్న నగర పోలీసు విభాగంలో డయల్? 100ను ఆశ్రయించే వారికి నిరీక్షణే మిగులుతోంది. ముఖ్యంగా రాత్రి వేళ ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. విధుల్లో ఉండే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయి. ఆగస్టు 1వ తేదీ అర్ధరాత్రి ఐకియా సమీపంలో రోడ్డు ప్రమాదం అనంతరం బాధితుడు డయల్ 100కు కాల్ చేసి సాయం కోరాడు. రాత్రి విధుల్లో ఉన్న గచ్చిబౌలి హెడ్ కానిస్టేబుల్ ఘటనాస్థలికి వెళ్లనే లేదు. సాంకేతిక కారణాలు సాకుగా చూపి 2 ఫిర్యాదుల్ని క్లోజ్ చేశాడు. విషయం గుర్తించిన సీపీ రమేశ్ హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు.నిర్లక్ష్యమే కారణామా : డయల్ 100కు సమాచారం అందాక సగటున 5-8 నిమిషాల్లో ఘటనా స్థలికి చేరుకుంటున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నారు. శివారులో సగటున అరగంట సమయానికి చేరుతున్నారు. డయల్ 100 ఫిర్యాదు విషయంలో స్పందన ఆలస్యం కావొద్దనే ఉద్దేశంతో పోలీసు శాఖ కొన్ని మార్పులు తీసుకొచ్చింది. డయల్ 100కు ఫోన్




చేసిన వ్యక్తి లైన్లో ఉండగానే స్థానిక పోలీస్ స్టేషన్?కు సమాచారం చేరేలా మార్పులు చేశారు.దానిద్వారా ప్యాట్రోలింగ్, బ్లూకోల్ట్ సిబ్బంది అప్రమత్తమై ఘటనాస్థలానికి చేరుకుంటారని పోలీసు శాఖ ఉద్దేశం. కానీ రాత్రివేళ విధుల్లో సిబ్బంది కొన్ని ఫోన్లను సీరియస్‌గా తీసుకోకపోవడం, రోడ్డు ప్రమాదాలను పట్టించుకోకపోవడంతో లక్ష్యం నీరుగారుతోంది. ఇటీవల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్‌లో డయల్? 100కు సరిగా స్పందించడం లేదని ఉన్నతాధికారులు గుర్తించారు. ఫిర్యదుదారుల సమాచారం: ఆలస్యంగా స్పందించడం ఒక కారణమైతే సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు బయటకు రావడం ఇబ్బందికరంగా మారుతోంది. అర్ధరాత్రి వేళ కాలనీల్లో బ్యాండ్? మోతలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, గంజాయి బ్యాచ్?లు, అల్లరి చేసే వ్యక్తుల గురించి స్థానికులు డయల్ 100కు సమాచారం ఇస్తుంటారు. పోలీసులు వెళ్లి అల్లరి మూకల్ని అదుపులోకి తీసుకుంటున్నా ఎవరు ఫిర్యాదు చేశారో చెబుతున్నారు. దీంతో తమపై ఎందుకు ఫిర్యాదు చేశావంటూ నిందితులు, బాధితులు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు.మేడ్చల్ మునీరాబాద్‌లో వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని జులై 29న స్థానికులు పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా, పది నిమిషాల్లో వస్తున్నామని చెప్పి గంటన్నర వరకు వెళ్లలేదు. మరో పోలీసు స్టేషన్‌లో ప్యాట్రోలింగ్‌కు వెళ్లడం వల్లే ఆలస్యం జరిగినట్లు సిబ్బంది స్థానికులకు బదులిచ్చారు.24 గంటల పాటు సేవలు : రాష్ట్రంలోని ఫిర్యాదులు 24 గంటలపాటు నేరుగా హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెళ్తాయి. ఓ వైపు స్పందించని సిబ్బంది, మరో నూరు శాతం సేవలు పోలీసులు సేవలు అందిస్తున్నారు. కంట్రోల్ రూమ్ నుంచి జిల్లాలోని పోలీస్? స్టేషన్‌లకు చేరవేస్తుంటారు. ఫిర్యాదు అందుకున్న ఠాణా పరిధిలోని బ్లూకోర్ట్స్?, పెట్రోలింగ్? సిబ్బంది ఆయా పరిధిలోకి 5 నుంచి 10 నిమిషాల వ్యవధిలో ఘటన స్థలానికి చేరుకుంటారు. ఇలా రోడ్డు ప్రమాదంలో గాయపడిన అనేక మందిని డయల్?-100 ద్వారా వచ్చిన ఫిర్యాదులతో పోలీసులు సకాలంలో ఆసుపత్రులకు తరలించి ప్రాణాలు రక్షించారు. ఫిర్యాదు నుంచి సమస్య పరిష్కారం వరకు డయల్?-100 విభాగం అధికారులు పర్యవేక్షిస్తుంటారు."కమిషనరేట్? పరిధిలోకి వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై స్పందిస్తాం. డయల్-100కు వచ్చే ఫిర్యాదులపై మరింత శ్రద్ధ వహిస్తున్నాం. కాల్స్? వచ్చిన వెంటనే ఘటన స్థలానికి చేరుకొని పూర్తిస్థాయి సమాచారం సేకరించి అత్యవసర సేవలు అందించడానికి ముందుంటాం. డయల్?-100లో ఫిర్యాదులు చేసినా తమ సిబ్బంది స్పందించకుంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి" -

# ఆర్ఎస్ ప్రవీణ్.. కల్వకుంట్ల కుటుంబానికి ఊడిగం చేస్తున్నారు

**హైదరాబాద్, ఆగస్టు 5:** బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై ఏఐసీసీ సెక్రెటరీ సంపత్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. (బుధ వారం) మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ డస్ట్ బిన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ టిష్యూ పేపర్ అంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత ప్రవీణ్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఒకే పోస్టు లో ఏడు సంవత్సరాలు ఉన్నారని ఆరోపిం చారు. ప్రవీణ్ కుమార్ జాతి ద్రోహి అని.. బీఎస్పీ పార్టీని కేసీఆర్ కాళ్ల దగ్గర పెట్టారని విమర్శించారు.ఐపీఎస్‌గా చేసిన వారు కూడా ఇలా ప్రవర్తించడం దారుణమని సంపత్ అన్నారు. కల్వకుంట్ల కుటుంబ మాయమాటల మత్తులో ఆర్ఎస్ ప్రవీణ్ ఉన్నారని... ఆ కుటుంబానికి ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. లీగల్ నోటీసులు ఎప్పుడు పంపుతారో హరీశ్ రావుకు తెలియదా?.. అడ్వకేట్ ఉన్నారు కదా అని



నోటీసులు పంపిస్తే ఎలా అని ప్రశ్నించారు. క్షుద్రపూజల ఆరోపణలపై హరీశ్ సమాధానం చెప్పాలని.. సమాధానం చెప్పకుండా నోటీసులు పంపడం విడ్డూరమని సంపత్ కుమార్ వ్యాఖ్యానించారు.

# ఫేక్ ఎన్ఓసి లపై విచారణ జరుగుతోంది: అభిలాష అభినవ్

హైదరాబాద్: ఇంటర్మీడియట్ కాలేజీలకు ఫైర్ ఎన్ఓసి కంపల్సరీ చేశామని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డుకు వచ్చిన కొన్ని ఫైర్ ఎన్ఓసి హైడ్రాతో సంప్రదించి పరిశీలి ంచగా, కొన్ని సర్టిఫికెట్లు బోగస్‌గా ఉన్నట్లు గుర్తించామన్నారు. హైడ్రాకు వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇంటర్మీడియట్ బోర్డుకు అందడంతో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చిందని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఫేక్ చీజల వ్యవహారంపై విచారణ కొనసాగుతోందని, విచారణ పూర్తయిన తర్వాత ఎన్ని నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారనే విషయం స్పష్టమవుతుందని తెలిపారు. ఫేక్ చీజలపై కఠిన చర్యలునకిలీ ఫైర్ చీజల విషయంలో హైడ్రా, ఇంటర్మీడియట్ బోర్డు సీరియస్‌గా ఉన్నాయని అభిలాష అభినవ్ వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఇంటర్మీడియట్ బోర్డు స్థాయిలో అంతర్గత విచారణ కూడా చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని




పేర్కొన్నారు.విద్యార్థులు ఆందోళన చెందొద్దు ఫేక్ ఎన్ఓసిల వ్యవహారంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అభిలాష అభినవ్ తెలిపారు. కాలేజీల అనుమతులకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటే వెబ్‌సైట్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చని సూచించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 3 వేలకుపైగా ఇంటర్మీడియట్ కాలేజీలు పొందినట్లు ఇంటర్మీడి యట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు.

# ఆర్టీసీ బస్సుల్లోనూ అడ్వాన్స్ టికెటింగ్ - మెట్రో తరహాలో ముందస్తుగా బుకింగ్

హైదరాబాద్: హైదరాబాద్ నగర ప్రయాణికుల సౌకర్యం కోసం టీజీఎస్ ఆర్టీసీ సరికొత్త విధానం అందుబాటులోకి తీసుకువస్తుంది. బస్సు ఎక్కే ముందే టికెట్ (అడ్వాన్స్, బోర్డింగ్ టికెటింగ్) పాలసీని త్వరలో ప్రవేశపెట్టనుంది. హైదరాబాద్ మెట్రో రైలు తరహాలో ఈ విధానం ఉంటుంది. మీ టికెట్ యాప్‌లోనే ఈ ఫీచర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో పాటు విద్యార్థులకు డిజిటల్ బస్‌పాస్‌లను జారీ చేసేందుకు ఆర్టీసీ తీవ్ర కసరత్తు చేస్తోంది.23 శాతం ఆన్‌లైన్ చెల్లింపులే : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 3200కి పైగా బస్సుల్లో రోజూ 26 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో 70 శాతం మంది మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణికులే. రోజూ ఆర్టీసీకి రూ.6.5 కోట్ల ఆదాయం వస్తోంది. ఇందులో 23 శాతం డిజిటల్ చెల్లింపులే ఉంటున్నాయి. తాజా విధానంతో డిజిటల్ చెల్లింపుల సంఖ్య




మరింత పెరగనుంది. నిత్యం ఉదయం, సాయంత్రం బస్సుల్లో అడుగు పెడదామంటే విపరీతమైన రద్దీతో భయమేస్తుంది. అంతలా ఉంటోంది రద్దీ. ఆ సమయంలో సీటు దొరక్క నిల్చుని జనాల మధ్య నుంచి టికెట్ తీసుకోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. మొబైల్ యాప్‌లో బోర్డింగ్ స్టాప్ : కొన్నిసార్లు డిజిటల్ చెల్లింపుల్లో టెక్నికల్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఈ క్రమంలో టికెట్ జారీలో ఆలస్యమై బస్సు వేగం, షెడ్యూల్‌పై వేగంగా ప్రభావం పడుతోంది. ప్రయాణానికి ముందే టికెట్ తీసుకోవడం ద్వారా అటు కండక్టర్లు, ఇటు ప్రయాణికులకు చాలా రకాల ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రయాణికులు వారి మొబైల్ యాప్‌లో బోర్డింగ్ స్టాప్, గమ్యస్థానం ఎంచు కొని యూపీఐ లేదా కార్డ్స్‌తో ముందే టికెట్‌ను బుకింగ్‌ను చేయవచ్చు. గమ్యం యాప్ ద్వారా బస్సులు ఎక్కడున్నాయో ట్రాక్ చేస్తూ టికెట్‌లో పేర్కొన్న సమయం ఆధారంగా ప్రయాణికులు వారి ప్రయాణాలను ముందస్తుగానే ప్లాన్ చేసుకోవచ్చు.విద్యార్థులకు డిజిటల్ బస్‌పాస్‌ల జారీ : ఆర్టీసీ ప్రవేశపెట్టిన డిజిటల్ బస్‌పాస్‌లకు ప్రయాణికులచేసుకోవచ్చు.విద్యార్థులకు డిజిటల్ బస్‌పాస్‌ల నుంచి మంచి స్పందన లభిస్తోంది. మీ టికెట్ మొబైల్ యాప్ ద్వారా ఫిబ్రవరి 25న ప్రారంభించగా ఇప్పటివరకు 14 వేల మందిని ఈ డిజిటల్ పాస్‌లను వినియోగించుకున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. దీంతో రూ.2 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ప్రస్తుతం ఇందులో సిటీ ఆర్డినరీ, మెట్రో డీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, పుష్పక్ బస్‌పాస్‌లు, టీ-24 టికెట్లు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. తాజాగా విద్యార్థుల బస్‌పాస్‌ల జారీకి ఆర్టీసీ నిర్ణయించింది. దీంతో బస్‌పాస్ కౌంటర్ల వద్ద రద్దీ, సిబ్బందిపై చాలా వరకు భారం తగ్గనుంది.చిలకలగూడలో కొత్త బస్ టెర్మినల్ : హైదరాబాద్?లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆర్టీసీ ముమ్మర చర్యలు చేపడుతోంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లోని రద్దీని తగ్గించేందుకు చిలకలగూడలో కొత్త బస్ టెర్మినల్, ఛార్జింగ్ స్టేషన్‌ను నిర్మాణం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సౌత్ సెంట్రల్ రైల్వే, ఆర్టీసీల మధ్య కుదిరిన ఉమ్మడి భూ బదిలీ ఒప్పందం ఆధారంగా ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు కానుంది.

# హైదరాబాద్‌లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంక్ట్రాక్ట్ క్యారేజ్ వాహనాల నిర్వాహకులు

హైదరాబాద్:హైదరాబాద్ నగరంలో కాంట్రాక్ట్ క్యారేజ్ వాహనాలకు ఇన్సూరెన్స్ ఉండదు, పీయూసీ(పొల్యూషన్ అండర్ కంట్రోల్) సర్టిఫికెట్ తీసుకోరు. చివరికి పర్మిట్ కూడా లేకుండానే రోడ్లెక్కుతున్నాయి. ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో ఇన్సూరెన్స్ చేయని వాహనాలే ఎక్కువగా ఉంటున్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో స్థానంలో పీయూసీ లేనివి, పర్మిట్ లేనివి ఉన్నాయి. మధ్యలో ఎవరినీ ఎక్కించుకోకుండా ప్రయాణికులను ఒకచోటు నుంచి మరో చోటుకు చేరవేసే ఈ కాంట్రాక్ట్ క్యారేజ్‌లకు పర్మిట్ లేకపోవడంతో ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 116 కేసులను సంబంధిత అధికారులు నమోదు చేశారు.టూరిస్టు బస్సులు, వ్యాన్లు, నగరం నుంచి దూరప్రాంతా



లకు వెళ్లే ప్రైవేటు బస్సులు కూడా కాంట్రాక్ట్ క్యారేజ్‌ల విభాగంలోకే వస్తాయి. ప్రైవేటు బస్సులు పేరుకు కాంట్రాక్ట్ క్యారేజ్‌లు అయినప్పటికీ అవి నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆపుతూ ప్రయాణికులను ఎక్కిం చుకుంటున్నాయి. అధికశాతం ఆటోలు ఈ విభాగంలోనే ఉన్నా యి. రాత్రి 10 తర్వాతే ట్రావెల్స్ బస్సులు రోడ్లపైకి రావాలని ట్రాఫిక్ అధికారులు సూచిం చినప్పటికీ 9 గంటల నుంచే రహదారులపైకి రావడంతో పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు.బీమా చేయడం తప్పనిసరి : ఇన్సూరెన్స్ లేని వాహనం ప్రమాదానికి గురై ఇతరులకు నష్టం కలిగించినట్లయితే సంబంధిత వాహన యజమానే బాధితుడికి పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. అందుకే చాలామంది థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌తో సరిపెడుతున్నారు. కొందరు అవీ తీసుకోవడం లేదు. నిత్యం తిరిగే ట్రావెల్స్ బస్సులకు బీమా చేస్తారు. ఆటోలు, ఇతర చిన్న వాహనాలు, స్థానికంగా తిరిగే వాహనదారులు అదో అదనపు భారంగా భావిస్తుంటారు. ఇన్సూరెన్స్ తప్పక చేయించుకోవాలి. అది వాహన యజమాని, డ్రైవర్‌ను ఆదుకునే రక్షాపత్రం అని చెప్పవచ్చు.గత 7 నెలల్లో వాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేకపోతే రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు ఒక్కో జోన్ పరిధిలో సగటున సుమారు 375 చొప్పున కేసులు నమోదయ్యాయి. ఇతర నిబంధనల ఉల్లంఘన కింద ఒక్కోల 150కి పైగానే కేసులు నమోదయ్యాయి.

# గాంధీభవన్‌కు చేరిన కాంగ్రెస్ నేతల వర్గపోరు..

హైదరాబాద్:కాంగ్రెస్ పార్టీ అంటే ఎవరి కుంపటి వారిదే అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. గ్రూపు రాజ కీయాలకు కేరాఫ్ అడ్రస్ ఏంటంటే కాంగ్రెస్ పార్టీ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఎప్పుడూ ఏదో ఒక చోట గ్రూప్ వార్ బయటకు వస్తూనే ఉంటుంది. తాజాగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో గ్రూపు తగాదాలు రచ్చకెక్కాయి.ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నూతన మండల అధ్యక్షుల ప్రకటనలో డీసీసీ అధ్యక్షు రాలు సుగుణక్క ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు వర్గం ఫైర్ అవుతోంది. పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్లను కాదని, కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి పదవులు ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ వాట్సాప్ గ్రూపుల్లో రెండు వర్గాల మధ్య మాటల యుద్ధం నెలకొంది. ఆ యుద్ధం సెగ కాస్తా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు తాకింది.



# రోడ్డును తీసుకుంటే..ఊరును తీసుకోవాలని గ్రామస్థుల ధర్నా




**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ఎయిర్‌పోర్టు( ) కోసం తమ గ్రామ రోడ్డును తీసుకుంటే మొత్తం గ్రామాన్ని తీసుకోవాలని కోరుతూ అనుకుంటా గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. బుధవారం గ్రామానికి చెందిన రైతులు కలెక్టరేట్‌కు తరలివచ్చి బైఠాయించి నిరసన తెలిపారు.ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల నష్టపోతున్న తమ భూములకు రూ.6 కోట్లు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.గ్రామస్థులు ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణానికి చేరుకోవాలంటే కేవలం రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ప్రయాణం చేస్తుండగా రోడ్డు ఎయిర్‌పోర్టులో పోతే 16 కిలోమీటర్లు దూర భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముందని పేర్కొన్నారు. రోడ్డుతో పాటు తమ గ్రామాన్ని మొత్తం తీసుకొని ఇతర ప్రాంతంలో తమకు పునరావసం కల్పించాలని కోరారు.

# 142 ఫైర్ ఎన్‌వోసీల్లో 52 నకిలీవే

హైదరాబాద్:హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీకి గురైంది. పలు ప్రైవేట్ ఇంటర్ కళాశాలలు అక్రమంగా ఫైర్ ఎన్‌వోసీలు పొందేందుకు ఆయన సంతకం ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. పలువురు ఉన్నతాధికారుల ఫోర్జరీ సంతకాలతోనే ప్రైవేట్ కాలేజీలు ఇంటర్‌బోర్డుకు ఫైర్ ఎన్‌వోసీలు సమర్పించినట్లు వెల్లడైంది. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని మొత్తం 142 ఫైర్? ఎన్?వోసీల్లో 52 నకిలీవేనని అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆయా కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్ బోర్డుకు అధికారులు మంగళవారం ఫిర్యాదు చేశారు.జీహెచ్?ఎంసీ కమిషనర్ సంతకమూ ఫోర్జరీ : అగ్నిమాపక నిరభ్యంతర ధ్రువపత్రాల కోసం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు కీలక అధికారుల సంతకాలను కూడా పలు కాలేజీ యాజమాన్యాలు ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. గతంలో అగ్నిమాపక శాఖలో పనిచేసి బదిలీ అయిన ఉన్నతాధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ సంతకాలు కూడా ఫోర్జరీ జరిగినట్టు తేల్చారు. అయితే ఈ



వ్యవహారంలో సూత్రధారులెవరు? పాత్రదారులెవరు అనే కోణంలో పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు.90లో 52 నకిలీ ఎన్?వోసీలే : తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో 142 జూనియర్ కళాశాలలు ఫైర్ ఎన్‌వోసీలు సమర్పించాయి. అందులో 90 వరకు ఒరిజనల్‌వి ఉండగా 52 ధ్రువపత్రాలు నకిలీవేనని తేలింది. వీటిని సమర్పించిన వారిపై తదుపరి చర్యలకు ఉద్దేశించి జులై 4న నెక్లెస్ రోడ్డులోని లేక్ పోలీసు స్టేషన్లో కేసు కూడా హైడ్రా నమోదు చేసింది. 2025-26, 2026-27 విద్యా సంవత్సరాలకు సంబంధించి జూనియర్ కళాశాలల యాజమాన్యాలు సమర్పించిన ఫైర్ ఎన్‌వోసీల ప్రతులన్నిటినీ హైడ్రా నిశితంగా పరిశీలించగా ఈ విషయం వెల్లడైంది.సింహభాగం నకిలీ? ధ్రువపత్రాలే : మొదటి దశలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు (డీఐఈవో) మొత్తం 76 ఫైర్ ఎన్‌వోసీలను ప్రామాణికత నిర్ధారణ కోసం పంపించారు. వాటిని హైడ్రా కార్యాలయ రికార్డులతో పరిశీలించగా, 7 ఫైర్ ఎన్‌వోసీలు నకిలీవని తేలింది. రెండో దశలో సంబంధిత జిల్లా డీఐఈవోలు మొత్తం 66 ఫైర్ ఎన్‌వోసీలను ధ్రువీకరణ కోసం పంపించారు. వీటిని కూడా హైడ్రా కార్యాలయ రికార్డులతో పరిశీలించగా, 45 ఫైర్ ఎన్‌వోసీలు నకిలివేనని తేలింది. ఈ మేరకు ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డుకు హైడ్రా సూచించింది.ఫోర్జరీ ఎన్‌వోసీలు పొందిన పలు కాలేజీలివే : హైదరాబాద్?లో కీలక ప్రాంతాల్లోని పలు ప్రైవేట్ ఇంటర్ కాలేజీలు ఫైర్ ఎన్‌వోసీల కోసం ఉన్నతాధిారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. తొలి విడత తనిఖీల్లో మెహిదీపట్నంలో ప్రియాంక ఇంటర్మీడియట్ కాలేజీ, విద్యానగర్?లోని మదర్స్ గర్ల్స్, చాంద్రాయణగుట్టలోని శ్రీచంద్ర, చిక్కడపల్లిలోని న్యూ ఎరా, శివరాంపల్లిలోని షాహీన్, తెల్లాపూర్‌లోని వశిష్ట, బర్కత్‌పురాలోని హైందవి, ఎస్ఆర్‌నగర్‌లోని రెజోనెన్స్ కాలేజీలు ఉన్నతాధికారుల ఫోర్జరీ సంతకాలతోనే నకిలీ ఎన్‌వోసీలను ఇంటర్ బోర్డుకు పంపించినట్లు అధికారులు గుర్తించారు.బోర్డులోని అధికారులు కుమ్మక్కు? : ఉన్నతాధికారుల సంతకాల ఫోర్జరీకి పాల్పడిన కళాశాలల గుర్తింపు కూడా రద్దు చేయాలని హైడ్రా అధికారులు ఇంటర్‌బోర్డును కోరారు. అయితే కొందరు ఇంటర్‌బోర్డులోని అధికారులు కూడా ఈ వ్యవహారంలో కుమ్మక్కైనట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మొత్తంగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. దర్యాప్తులో ఎటువంటి విషయాలు వెలుగు చూస్తాయో వేచి చూడాల్సి ఉంది.



# ‘కరికాల’గా సందీప్ కిషన్..

## రెండు భాగాలుగా భారీ ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం!

యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లో ఓ భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఆయన కథానాయకుడిగా ‘కరికాల’ అనే టైటిల్‌తో ఓ ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం తెరకెక్కుతోంది. బుధవారం ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ రాజసం ఉట్టిపడే అవతారంలో కనిపించారు. ఓ అడవిలో గుర్రంపై కూర్చుని, చేతిలో పదునైన కత్తి పట్టుకుని శక్తివంతమైన యోధుడిగా దర్శనమిచ్చారు. పక్కనే సింహంతో అతడి గంభీరమైన లుక్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ‘శంబాల’ ఫేమ్ యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఇది ఒక ఫాంటసీ చిత్రమని, భారీ విజువల్ ఎఫెక్ట్స్, విస్తృతమైన వరల్డ్ బిల్డింగ్‌తో దీన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. ‘కరికాల’ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. చాప్టర్-1ను 2027 జూలై 2న, చాప్టర్-2ను అదే ఏడాది అక్టోబర్ 28న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. తారాగణం, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని నిర్మాతలు తెలిపారు. ఇదిలా ఉండగా, సందీప్ కిషన్ ప్రస్తుతం ‘సిగ్మా’ అనే మరో చిత్రం విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. తమిళ స్టార్ హీరో విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా జూలై 31న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఇప్పుడు ‘కరికాల’ ప్రకటనతో సందీప్ తన కెరీర్‌లోనే ఓ భారీ ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు.

# వరుణ్ తేజ్ ‘కొరియన్ కనకరాజు‘ ప్రీమియర్లు !

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన తదుపరి చిత్రం ‘కొరియన్ కనకరాజు‘ విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న విడుదల కానున్న ఈ సినిమాను ఒకరోజు ముందుగానే, అంటే ఆగస్టు 6న పెయిడ్ ప్రీమియర్ల రూపంలో ప్రేక్షకులకు చూపించేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కాగా, అద్భుతమైన స్పందన లభిస్తుండటం సినిమాపై ఉన్న అంచనాలకు అద్దం పడుతోంది.ఇటీవల జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ తేజ్ ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. రేపు (ఆగస్టు 6) సాయంత్రం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు థియేటర్లలో ప్రత్యేక పెయిడ్ ప్రీమియర్లు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సినిమా కంటెంట్‌పై తమకు ఉన్న గట్టి నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ ముందస్తు పాజిటివ్ టాక్‌ను సంపాదించుకోవడంలో కీలకం కానుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వస్తున్న ఈ హారర్-కామెడీ చిత్రంపై ముందు నుంచీ మంచి బజ్ ఉంది. విడుదలైన ట్రైలర్, టీజర్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. దీనికి తోడు తమన్ అందించిన సంగీతం కూడా శ్రోతలను ఆకట్టుకుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ ప్రారంభమైన అడ్వాన్స్ బుకింగ్స్‌కు అనూహ్య స్పందన వస్తోంది. ఆ వారం విడుదలవుతున్న ఐదు సినిమాల్లో ‘కొరియన్ కనకరాజు‘పైనే అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై రాజీవ్ రెడ్డి, సాయి బాబా జాగర్లమూడి ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించారు. వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, సత్య, దక్ష నగార్కర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వరుస ఫ్లాపుల తర్వాత వస్తున్న ఈ సినిమాతో వరుణ్ తేజ్ గట్టి కమ్‌బ్యాక్ ఇస్తారని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి. ప్రీమియర్ల తర్వాత వచ్చే టాక్, ఆయన కెరీర్‌కు ఎంతవరకు బూస్ట్ ఇస్తుందో చూడాలి.






# రాజకీయాలపై శోభిత ధూళిపాళ సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ నటి, అక్కినేని నాగచైతన్య భార్య శోభితా ధూళిపాళ తన రాజకీయ భావజాలంపై చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియా వ్యాప్తంగా విపరీతమైన చర్చకు దారితీస్తున్నాయి. “నాకు వామపక్ష భావజాలం చాలా ఎక్కువ. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కమ్యూనిజమే కచ్చితంగా విజయం సాధిస్తుంది“ అని ఆమె చెప్పిన మాటలు పెను దుమారమే రేపాయి.గ్లామర్ ఇండస్ట్రీలో ఉంటూ, తమ కెరీర్ దెబ్బతింటుందనే భయంతో ఏ హీరోయిన్ కూడా పొలిటికల్ ఐడియాలజీని బయటకు చెప్పేందుకు ఇష్టపడరు. అలాంటిది శోభితా ధూళిపాళ ఎలాంటి దాపరికం లేకుండా, అత్యంత ధైర్యంగా తన మనసులోని అభిప్రాయాలను బయటపెట్టడంపై కొందరు ప్రశంసలు కురిపిస్తున్నారు. వ్యక్తిగత భావ ప్రకటన స్వేచ్ఛకు గౌరవం ఇస్తూ ఆమె నిజాయతీని కొనియాడుతున్నారు.అయితే, మరికొందరు నెటిజన్లు మాత్రం ఆమె వ్యాఖ్యలపై తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. చిత్ర పరిశ్రమలో నటిగా ఉంటూ, అత్యంత విలాసవంతమైన లైఫ్‌స్టైల్‌ను గడుపుతున్న శోభిత... కమ్యూనిజం గురించి మాట్లాడటం సరికాదని కామెంట్స్ చేస్తున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఆమె చెప్తున్న సిద్ధాంతాలు ఆచరణాత్మకంగా ఎంతవరకు సాధ్యమని ప్రశ్నిస్తున్నారు.ఇక సినిమాల విషయానికి వస్తే, నాగచైతన్యతో వివాహం తర్వాత కొంత విరామం తీసుకున్న శోభిత..జ ‘చీకటిలో‘, ‘క్రాస్ రోడ్స్‘ వంటి ప్రాజెక్టులతో అలరించారు. ప్రస్తుతం ఇవి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ‘సిల్ బట్టా‘, ‘వెట్టువం‘ వంటి వినూత్న చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.

# ఉదయనిధి స్టాలిన్ సినిమాకు త్రిష నో చెప్పారా?



కొన్నాళ్ల క్రితం హిందూ మతంపై చేసిన వ్యాఖ్యలతో కొన్నాళ్లు వార్తల్లో నిలిచిన డీఎంకే శాసనసభాపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తాజా వివాదంతో మళ్లీ వార్తల్లో కెక్కారు. సినీ నటి త్రిషపై ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన అరెస్టవడం, బెయిల్‌పై విడుదలవడం మనకు తెలిసిందే. ఈ వివాదం నేపథ్యంలో, గతంలో వీరిద్దరి కాంబినేషన్ గురించి వెలువడిన వార్తలు మళ్లీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఉదయనిధి సినిమాలో నటించేందుకు త్రిష నిరాకరించారని, రూ. 12 కోట్ల పారితోషికం ఆఫర్‌ను రిజెక్ట్ చేశారనే ప్రచారం మళ్లీ తెరపైకి వచ్చింది.2018లో దర్శకుడు కె.ఎస్. అధియమాన్ దర్శకత్వంలో ‘ఏంజెల్‘ అనే టైటిల్‌తో ఒక సినిమా రాబోతుందని, అందులో త్రిష కథానాయికగా నటిస్తోందని వార్తలు రాగా, ఆ వార్తల్లో నిజం లేదని అప్పట్లోనే చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇక ఇటీవల ఉదయనిధికి చెందిన రెడ్ జెయింట్ మూవీస్ నిర్మాణంలో నటించేందుకు త్రిషకు రూ. 12 కోట్లు ఆఫర్ చేశారనే వార్త నెట్టింట చక్కర్లు కొట్టినప్పటికీ, దీనిపై త్రిష లేదా రెడ్ జెయింట్ సంస్థ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మీడియా సైతం దీనిని కేవలం ఒక పుకారుగా లేదా నిర్ధారణ లేని అంశంగానే పేర్కొంది.

# తాను చదువుకున్న స్కూల్‌కు ధనుష్ అపురూప కానుక!

తాను చదువుకున్న పాఠశాలకు నటుడు ధనుష్ విలువైన కానుక అందించాడు. చెన్నైలోని సాలిగ్రామంలో ఉన్న తాయ్ సత్య మెట్రిక్యులేషన్ పాఠశాలకు మూడు అంతస్తుల కొత్త భవనాన్ని నిర్మించి విరాళంగా ఇచ్చాడు. ఈ కొత్త భవనానికి ‘ధనుష్ బ్లాక్’ అని పేరు పెట్టడం విశేషం.ధనుష్ పదో తరగతి వరకు ఇదే పాఠశాలలో చదివాడు. ఇటీవల కొత్త భవనం ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ధనుష్ తన స్కూల్ సహచరుడు, సినిమాటోగ్రాఫర్ కుమరన్‌తో కలిసి హాజరయ్యాడు. ఇద్దరూ 1999 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు.ఈ సందర్భంగా ధనుష్ తన ఉపాధ్యాయులందరి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నాడు. వారితో కలిసి ఫొటోలు దిగాడు. ఈ దృశ్యాలు అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేశాయి.ధనుష్‌తో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు కలిసి చదివిన కుమరన్, ఆయన భార్య లక్ష్మీ కృప కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కుమరన్ మాట్లాడుతూ.. పదో తరగతి వరకు తాము ముగ్గురూ ఇదే పాఠశాలలో చదివామని చెప్పాడు. ఆ తర్వాత ధనుష్‌తో కలిసి మరో పాఠశాలలో ఇంటర్ పూర్తి చేశానన్నాడు. ధనుష్ సినీ రంగంలోకి వెళ్లగా, తాను ఇంజినీరింగ్ పూర్తి చేసి తర్వాత సినిమాటోగ్రాఫర్‌గా మారినట్టు తెలిపాడు. ‘తంగమగన్’ వంటి చిత్రాల్లో ధనుష్‌తో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేశాడు.పాఠశాల భవనాల పరిస్థితి గురించి తెలుసుకున్న ధనుష్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కొత్త భవనం నిర్మించారని కుమరన్ చెప్పాడు. అంతేకాదు, పాత భవనాలను పునరుద్ధరించడంతో పాటు ఖాళీ స్థలాల్లో మరిన్ని కొత్త భవనాలు కూడా నిర్మిస్తానని ధనుష్ హామీ ఇచ్చాడని వెల్లడించాడు. ఆయన చేసిన సాయం తమను ఎంతో కదిలించిందని అన్నాడు.ఇటీవల ప్రకటించిన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో ధనుష్ నటుడిగా ఒకటి, దర్శకుడిగా మరొటి ఇలా రెండు జాతీయ అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న ‘ఓం’ చిత్రంలో నటిస్తున్నాడు. ఈ సినిమాలో మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి కూడా కీలక పాత్ర పోషిస్తున్నాడు.




# 41 గంటలు నిర్విరామంగా షూటింగ్ లోనే కీర్తి సురేష్!

భారతీయ చలన చిత్ర పరిశ్రమలో పని గంటల వివాదం ఎంత సంచలనమైందో తెలిసిందే. సెట్ లో 8 గంటలు మించి పని చేయించుకోవడంపై చాలా మంది హీరోయిన్లు బాహాటంగా విమర్శలు చేసారు. పనికి తగ్గ పారితోషికం ఇవ్వడం లేదని..అలాంటప్పుడు ఎందుకు? పని చేయాలని మరికొంత మంది నటీమణులు తెరపైకి వచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా కీర్తి సురేష్ ఏకంగా 41 గంటల పాటు నిర్విరామంగా పనిచేసి పని తనకు భారం కాదని నిరూపించారు. వివరాల్లోకి వెళ్తే..ఒకే సమయంలో పలు చిత్రాల షూటింగ్‌లతో బిజీగా ఉండటం వల్ల తాను పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ కీర్తి సురేష్ చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి.

ఇటీవలి కాలంలో విభిన్న భాషల్లో ప్రాజెక్టలను అంగీకరిస్తున్న కీర్తి సురేష్ డేట్స్ సర్దుబాటు చేయడం కోసం ఎంతగా శ్రమించాల్సి వస్తుందో వివరించారు. ముఖ్యంగా ఒక పెద్ద ప్రాజెక్ట్ షూటింగ్ నుండి నేరుగా మరో సినిమా సెట్స్‌కు పరిగెత్తాల్సిన పరిస్థితుల్లో విశ్రాంతి లేకుండా పనిచేయాల్సి వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో ఏకంగా 41 గంటలపాటు ఎలాంటి నిద్ర లేకుండా మెలకువగానే ఉంటూ షూటింగ్‌లలో పాల్గొన్నానని సంచలన నిజం బయటపెట్టారు. చాలా సందర్భాల్లో సెట్ లో 12 గంటలకు మించి పనిచేసిన సందర్భాలున్నాయన్నారు. సినిమా పరిశ్రమ బయట నుంచి చూసే వారికి గ్లామర్‌గా కనిపిస్తుందని కానీ తెర వెనుక నటీనటులు పడే శ్రమ, పడే మానసిక , శారీరక ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. నిరంతరం ప్రయాణాలు చేస్తూ రాత్రింబవళ్లు తేడా లేకుండా పనిచేయడం వల్ల ఒక్కోసారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని తెలిపారు. అయినప్పటికీ వృత్తిపై ఉన్న అంకితభావంతోనే ఇన్ని కష్టాలను ఎదుర్కొని ముందుకు సాగుతున్నట్లు కీర్తి పేర్కొన్నారు. ప్రస్తుతం టాలీవుడ్ .. ఇతర ఇండస్ట్రీలలో నటీనటులు, సాంకేతిక నిపుణుల కోసం 8 గంటల పని గంటల నిబంధనను తీసుకురావాలనే డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి.

